క్లుప్తంగా

నేడు వాహనాల బహిరంగ వేలం

మడకశిర: మడకశిర సెబ్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను గురువారం ఉదయం 10 గంటలకు మడకశిరలోని సెబ్‌స్టేషన్ వద్ద బహిరంగ వేలం వేయనున్నట్లు సెబ్ సీఐ భార్గవ్‌రెడ్డి తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు ఉదయం 9 గంటలకే సెబ్ స్టేషన్ వద్దకు వచ్చి ఆధార్, పాన్‌కార్డులను సమర్పించాలని కోరారు. వాహనాలకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలో ముందుగానే 10 శాతం డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల సీజ్



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

హిందూపురం అర్బన్: కర్ణాటక సరిహద్దున బేవనహళ్లి వద్ద పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. వాటిని రూరల్ స్టేషన్‌కు తరలించామన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండటంతో ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవన్నారు.

కుష్టుపై పక్కాగా సర్వే



కరపత్రాలు విడుదల చేస్తున్న మెడికల్ ఆఫీసర్లు

పరిగి: కుష్టు రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ స్వరూపరెడ్డి, డాక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో బుధవారం వైద్యారోగ్య సిబ్బందితో కుష్టు వ్యాధి పట్ల అవగాహన, గ్రామాలలో చేపట్టాల్సిన సత్వర చర్యలను వివరించారు. వారు మాట్లాడుతూ ఈనెల 27 నుంచి వచ్చే ఏడాది జనవరి 12 వరకూ ప్రతి గ్రామంలోనూ కుష్టు వ్యాధిపై ప్రత్యేక సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. సర్వేను పక్కాగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వన్నప్ప, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

హిందూపురం: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ బుధవారం కరపత్రాల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు అన్నారు. ఆర్టీసీ డిపోలో పోస్టర్లు ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా జోనల్ కార్యదర్శి ఎం చెన్నారెడ్డి, నాయకులు రాజారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

అసత్య ఆరోపణలు తగవు



మున్సిపల్ బ్యానర్‌ను తొలగిస్తున్న సుధామణి

పెనుకొండ: 'పట్టణంలోని దర్గాపేటలో ఉన్న వెంకటసాయి సొసైటీ వాటర్ ప్లాంట్ నిర్వాహకురాలు శ్రీమతి సుధామణి నాలుగు రోజులుగా మున్సిపల్ సిబ్బందిపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారు. ఈ ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదు' అని నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపాల్టీకి, వాటర్‌ప్లాంట్ నిర్వాహకురాలు సుధామణికి మధ్య ప్లాంట్ విషయంలో జరుగుతున్న వివాదం నేపథ్యంలో బుధవారం ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన సుధామణిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

రేపు కౌన్సిల్ మీట్

మడకశిర: మడకశిర మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ ఆఫీస్‌లోని సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ప్రభాకర్‌రావు తెలిపారు. సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ అధ్యక్షత వహిస్తారన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలను వివరిస్తున్న వైద్యుడు కేశవులు

పరిగి: 'నిత్యం మనం తినే ఆహార పదార్థాల్లో తగిన పోషకాలు మాత్రమే కలిగి ఉండేలా చూసుకోవాలి. పరిమితికి మించిన పోషకాలను తీసుకుంటే ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నట్లే' అని వైద్యులు తెలిపారు. మండలంలోని ఏపీ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల (ఏపీఎఆర్ఎస్)లో బుధవారం విద్యార్థులకు పోషక విలువలు, నిత్యం తీసుకోవాల్సిన పరిమాణ పదార్థాలపై అవగాహన కల్పించారు. వైద్యులు కేశవులు, శ్రీక్రాంతి, రామచంద్రరావు, ఆదినారాయణ ఆధ్వర్యంలో ఆరోగ్య సూత్రాలను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మురళీధర్‌బాబు, ఉపాధ్యాయుడు కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

జోరుగా ఆడుదాం ఆంధ్రా



వెంకటాపురం తండా గెలుపు

పెనుకొండ: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా బుధవారం స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో జరిగిన క్రికెట్ పోటీలో వెంకటాపురం తండా జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన వెంకటాపురం తండా జట్టు 10 ఓవర్లలో 80 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన పెనుకొండ పట్టణం శ్రీరాములయ్య కాలనీ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 76 పరుగులు చేసి ఓటమి పాలైంది.



రొద్దం సచివాలయం పరిధిలో కబడ్డీ ఆడుతున్న దృశ్యం

గుడిబండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు జోరుగా సాగుతున్నాయి. బుధవారం గుడిబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాలీబాల్, క్రికెట్ పోటీలను నిర్వహించారు. పీడీ సాయికృష్ణ పోటీలను పర్యవేక్షించారు. గ్రామీణ క్రీడాకారుల్లోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ పోటీలను నిర్వహిస్తోందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడ్, జేసీఎస్ కన్వీనర్ శివకుమార్ తెలిపారు. సింగల్‌విండో అధ్యక్షుడు చంద్ర, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: మండలంలోని దుద్దేబండ, మావటూరు, ఎర్రమంచి, వెంకటగిరిపాళ్యం గ్రామాల్లో బుధవారం కూడా క్రీడా పోటీలు జరిగాయి. బ్యాడ్మింటన్, క్రికెట్, వాలీబాల్ పోటీలను నిర్వహించగా క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పరిగి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల క్రీడా మైదానాలు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాలతో సందడి చేస్తున్నాయి. మండల కేంద్రం పరిగి, ఏపీఆర్ఎస్ కొడిగెనహళ్లిలో బుధవారం వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. పోటీలను అధికారులు, నోడల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో నిర్వహించారు

రొళ్ల: మండల పరిధిలోని దొమ్మరహట్టి గ్రామ వద్ద ఉన్న బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర రెసిడెన్సియల్ పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీల్లో భాగంగా జరిగిన వాలీబాల్ పోటీలు కొనసాగాయి. దీంతో హులీకుంట సచివాలయం టీం–1, టీం–2 మధ్య జరిగిన పోటీలో టీం–1 విజయం సాధించారు. గెలుపొందిన విజేతలను సర్పంచ్ కరియమ్మ, వైఎస్ సర్పంచ్ రవికుమార్, నాయకులు దొడ్డయ్య, డి.రవికుమార్ తదితరులు అభినందించారు.

గోరంట్ల: మండలంలోని బూదిలి, పులేరు, మల్లాపల్లి, మందలపల్లి సచివాలయాల పరిధిలో బుధవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు జరిగాయి. సచివాలయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన జట్లను మండలస్థాయికి ఎంపిక చేశారు.

రొద్దం: మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయ పరిధిలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో బుధవారం ఉత్సాహంగా క్రీడా పోటీలు నిర్వహించారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ తదితర క్రీడా పోటీలు నిర్వహించినట్లు ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ తెలిపారు.

అమరాపురం: మండలంలోని అమరాపురం, బసవనపల్లి, వలస, హేమవతి గ్రామ సచివాలయ పరిధిలో బుధవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించారు. ఎంపీపీ ఈరన్న మాట్లాడుతూ యువత, క్రీడాకారుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడానికే రాష్ట్ర ప్రభుత్వం ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తోందన్నారు. క్రీడాకారులు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ స్వారక్క, ఎంపీడీఓ మునిస్వామి, ఈఓఆర్డీ నాగముని తదితరులు పాల్గొన్నారు.

అగళి: మండల పరిధిలోని ఇనగలూరు, ఇరిగేపల్లి, ఆర్‌జీ పల్లి, అగళి క్రీడా ఆవరణలో ఆడుదాం ఆంధ్రా పోటీలను ఎంపీడీఓ రవిప్రసాద్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించారు.

మడకశిరరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విద్యతో పాటు క్రీడల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత కల్పించి ప్రోత్సహిస్తున్నారని క్రీడాకారులు 'ఆడుదాం ఆంధ్రా' పోటీల్లో రాణించాలని ఎంపీపీ కవిత తెలిపారు. బుధవారం ఆమిదాలగొంది, మణూరు, బుళ్లసముద్రం, జీవీపాళ్యం గ్రామ సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. సర్పంచులు రంగమ్మ, రామలింగమ్మ, వైస్ ఎంపీపీ శ్రీరామరెడ్డి, ఎంపీడీఓ సోనిబాయి, ఎంఈఓ భాస్కర్, ఈఓఆర్డీ శైలజ, ఎంపీటీసీలు, పీఈటీలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



పరిగిలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



పెనుకొండ: వెంకటగిరిపాళ్యంలో బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు



అగళి మండలం ఇనగలూరులో కబడ్డీ పోటీల్లో పాల్గొన్న యువకులు



మడకశిర మండలం మణూరులో క్రీడాకారులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ సోనిబాయి

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో దీపిక

● వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక

చిలమత్తూరు: అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. బుధవారం మండలంలోని కోడూరులో ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు పార్టీ శ్రేణులు, మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం జగన్ అనేకమైన సంక్షేమ పథకాలు అమలు చేశారని, ఆయన పేదలకు ఆత్మ బంధువు అని కొనియాడారు. ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ నరేష్‌కృష్ణ, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు మురళీమోహన్, తిరుమలేష్ , మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు మంజునాథరెడ్డి, ఆదినారాయణ, సింగిల్‌విండో చైర్మన్ హనుమంతరెడ్డి, నాయకులు చిన్నప్పయ్య, సతీష్, రవీంద్రరెడ్డి, నాగేంద్రరెడ్డి, అయూబ్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మహీంద్రరెడ్డి, శివన్న, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

వీరాపురం పంచాయతీ హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన 20 కుటుంబాలు బుధవారం ఎంపీపీ ఆధ్వర్యంలో హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ఈ సందర్భంగా ఆమె వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వడ్డె వెంకటరమణప్ప, వడ్డె ఆదినారాయణప్ప, వడ్డె హనుమంతు, వడ్డె సురేష్, వడ్డె నారమ్మ మరికొందరు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

కనుల పండువలా పూల రథోత్సవం



పూల రథంపై కొలువుదీరిన సిద్ధేశ్వరస్వామి

అమరాపురం: మండలంలోని హేమావతిలో వెలసిన సిద్ధేశ్వరస్వామి పూల రథోత్సవం ఘనంగా జరిగింది. మంగళవారం అర్ధరాత్రి స్వామి ఉత్సవ విగ్రహానికి పూజలు చేసి రథంలో కొలువుదీర్చారు. అనంతరం అక్కడి నుంచి మేళతాళాలతో ఆంజనేయస్వామి ఆలయం వరకు తాడుసాయంతో రథాన్ని లాగారు. బుధవారం తెల్లవారుజామున భక్తులు తెచ్చిన బొరుగులను రాసిగా పోశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

శభాష్ అన్విక



అవార్డుతో అన్విక

పావగడ: పట్టణంలోని బనశంకరి లే అవుట్‌కు చెందిన అరవింద్, అశ్విని దంపతులకు చెందిన దాదాపు రెండేళ్లున్న అన్విక ఇటీవల ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు నిర్వహించిన ఐక్యూ పరీక్షలో సత్తాచాటింది. 57 జంతువులు, 18 కూరగాయలు, 21 పండ్లు, 20 వాహనాలు, 19 పక్షులు, 19 ఆహార పదార్థాలు, 9 అంకెలు, 21 వివిధ వస్తువులు, 10 ఆకారాలు, 16 శరీర భాగాల పేర్లు గుక్క తిప్పకుండా చెప్పింది. అలాగే నర్సరీ రైమ్స్, ఇంగ్లిష్ అక్షరాలు, 8 జంతువుల అరుపుల అనుకరణ వంటి ప్రదర్శనలతో అందరినీ మెప్పించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుంది.

పాఠశాలలో మరమ్మతుకు చర్యలు

సోమందేపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మరమ్మతు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఎస్ఏ డీఈ చిదంబరం తెలిపారు. బుధవారం కస్తూర్బా పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఎస్.ఎం.ఎం.ఎఫ్ ద్వారా పాఠశాలకు రూ.3 లక్షల నిధులు విడుదలైనట్లు చెప్పారు. తాగునీటి ఆర్వో ప్లాంట్, విద్యుత్ సామగ్రి, ఇతర మరమ్మతుల కోసం నిధులు వినియోగించుకోవాలని ఎస్ఓ అనీతకు సూచించారు.

ఇస్తెమా నిర్వహణకు ఏర్పాట్లు



పరిగి రోడ్డులో ఇస్తెమా నిర్వహణకు స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

హిందూపురం: పట్టణంలోని పరిగి రోడ్డు వద్ద జనవరి 3, 4వ తేదీల్లో నిర్వహించనున్న ఇస్తెమాకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్డంపల్లి వేణరెడ్డి అన్నారు. బుధవారం ముస్లిం పెద్దలు, నాయకులతో ఆయన సమావేశమయ్యారు. వేణురెడ్డి మాట్లాడుతూ ఇస్తెమా నిర్వాహణకు అవసరమైన లైటింగ్, నీరు, ఇతర సదుపాయల కల్పనకు సహకారం అందిస్తామన్నారు. అనంతరం మున్సిపల్ అధికారులు, పోలీసులకు పలు సూచనలు చేశారు.

స్థానికులకే ఉద్యోగాలు కల్పించండి

పావగడ: తాలూకాలోని తిరుమణి సోలార్ పార్క్‌లో స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ స్థానిక బీఎస్పీ నాయకులు బుధవారం పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. బీఎస్పీ అధ్యక్షుడు టి హనుమంతరాయ మాట్లాడుతూ సోలార్ పార్క్ నిర్మాణానికి సుమారు 22 వేల ఎకరాల భూమిని లీజ్ పద్ధతిలో అందించిన సోలార్ రైతుల కుటుంబాలకే ఉద్యోగాలు ఇవ్వాలన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

చిలమత్తూరు: మండలంలోని కొడికొండ చెక్ పోస్ట్ దగ్గర నిర్వహించిన తనిఖీల్లో గోరంట్ల మండలానికి చెందిన వి నాగార్జున నుంచి 90 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

ఘనంగా మండల పూజోత్సవం



రొళ్లలో దీపారాధన చేస్తున్న కన్యస్వాములు



కిరికెరలో అలంకరణలో అయ్యప్పస్వామి

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన అయ్యప్పస్వామి దేవాలయ ఆవరణలో అయ్యప్ప భక్తులు బుధవారం మండల పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప భక్తులు ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించి పడి పూజోత్సవం జరిపారు. సాయంత్రం అయ్యప్పస్వామి విగ్రహాన్ని ఊరేగించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

హిందూపురం: మండల పరిధిలోని కిరికెర పంచాయతీలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం మండల పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మరోవైపు బెంగళూరు రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయంలోనూ మండల పూజను భక్తిశ్రద్ధలతో చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



పెనుకొండ: ప్రమాదంలో దెబ్బతిన్న కారు

రొళ్ల: పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రంగయ్య, పాతన్న ఇరువురు తీవ్రంగా గాయ పడ్డారు. వివరాల్లోకి వెళితే... అగళి మండలం దొక్కలపల్లి చెందిన రంగయ్య స్వగ్రామం నుంచి మడకశిర వైపు ద్విచక్ర వాహనాల్లో స్నేహితులతో కలిసి వెళుతున్నారు. అమరాపురం మండలానికి చెందిన పాతన్న మడకశిర వైపు నుంచి ద్విచక్ర వాహనాల్లో స్నేహితులతో కలిసి వస్తున్నారు. రొళ్ల సమీపంలోని మడకశిరకు వెళ్లే జాతీయ రహదారి కూడలి వద్ద ఇరువురు ఢీ కొన్నారు. ఈ ఘటనలో రంగయ్య, పాతన్నకు తీవ్ర గాయాలు కావడంతో హిందూపురం, బెంగళూరు తరలించారు.

పెనుకొండలో ఇద్దరికి...

పెనుకొండ: పట్టణ సమీపంలోని పులేకమ్మ ఎత్తు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్ష్మి అనే మహిళ తీవ్రంగా గాయపడింది. మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. కర్నూలు జిల్లా వనపర్తికి చెందిన లక్ష్మితో పాటు కుటుంబ సభ్యులు కారులో బెంగళూరు వైపు వెళుతున్నారు. అయితే పులేకమ్మ ఎత్తు వద్ద టైర్ పగలడంతో కారు అదుపు తప్పి పక్క రోడ్డులోకి వచ్చి బెంగళూరు నుంచి అనంతపురం వైపు వెళ్తున్న ఇన్నోవా కారును బలంగా ఢీకొంది. దీంతో లక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. కారులోని మరో ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చిలమత్తూరులో ఒకరు..

చిలమత్తూరు: మండలంలోని 544ఈ జాతీయ రహదారి టేకులోడు క్రాస్ వద్ద బుధవారం సాయంత్రం కారు.. బైక్‌ను ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంలో వెళుతున్న యగ్నిశెట్టిపల్లికి చెందిన రవికుమార్, సుబ్బులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు హుటాహుటిన 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వైకుంఠ రథం ప్రారంభం

పెనుకొండ: ఉచిత సర్వధర్మ వైకుంఠ రథాన్ని సూఫీ సత్పురుషుల జాతీయ వేదిక నాయకులు బుధవారం బాబయ్య దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా చేతుల మీదుగా ప్రారంభించారు. కులమతాలకు అతీతంగా అందరూ వైకుంఠ రథాన్ని ఉచితంగా వినియోగించుకునే జాతీయ వేదిక నాయకులు నిర్ణయించారు. కార్యక్రమంలో గిన్నీస్ బుక్ రికార్డ్ విజేత గజల్ శ్రీనివాస్, కవి జాబిలి చాంద్‌బాషా, జేఈ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

హిందూపురం టౌన్: కేర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని భగీరథ సర్కిల్, ఆటోనగర్‌లో నిరుపేదలకు బుధవారం నిత్యావసరాలను పంపిణీ చేశారు. సంస్థ డైరెక్టర్ పెరినయగస్ స్వామి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ లత, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు శంకరయ్య, ఆయుర్వేద డాక్టర్ అనురాధ నిత్యవసరాలను అందించారు.

నోరూరించే ఖాజా



ఖాజాను కొనుగోలు చేస్తున్న భక్తులు

పెనుకొండ: పట్టణంలో బాబయ్య దర్గా ఉరుసు ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే ఇక్కడ తయారు చేసి అమ్ముతున్న ఖాజా (తియ్యని పదార్థం) కొనుగోలుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు. నెయ్యి, నూనె, పిండితో చేసే ఖాజాను వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో తీసుకెళ్తున్నారు. కిలో ఖాజాను రూ.240 ప్రకారం వ్యాపారులు విక్రయిస్తున్నారు.

రైల్వేగేట్ మూసివేత

పెనుకొండ రూరల్: మండల పరిధిలోని పెద్ద చెరువు కట్ట ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఉన్న రైల్వేగేట్ మరమ్మతు పనుల కారణంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి శుక్రవారం ఉదయం 6 గంటల వరకూ మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. వాహనదారులు గమనించాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సోమందేపల్లి: మండలంలోని చెన్నాపురం గ్రామానికి చెందిన తిమ్మరాయప్ప (54) మంగళవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. అయితే చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. నాలుగు రోజుల క్రితం తిమ్మరాయప్ప కుమారుడు ఓ బాలికను ఎత్తుకెళ్లినట్లు మైనర్ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. మనస్తాపానికి గురైన తిమ్మరాయప్ప మంగళవారం గ్రామ సమీపంలో ఉన్న కొండ ప్రాంతానికి వెళ్లి అక్కడే పురుగుల మందు తాగి ఇంటికి వచ్చాడు. అపస్మారక స్థితిలో వెళ్లడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.